సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



పరిశోధనకు పట్టం

సీసీఈ నిర్వహించే జిజ్ఞాసలో జడ్చర్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.

వివరాలు 8లో ▸



పండుగలకు సైతం దూరంగా..

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



వాతావరణం

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలీసులకు ప్రజలు సహకరించాలి: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: రంజాన్ పండగ సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని వానగుట్ట సమీపంలో ఉన్న ఈద్గాను ఎస్పీ జానకి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. స్థానికంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. శాంతిభద్రతలతో పాటు ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో పండగ ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవడానికి పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజల రద్దీని దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామన్నారు. ఈద్గా, మసీదులు, ప్రధాన చౌరస్తాలలో అదనపు సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, ఎలాంటి సమస్య ఉన్న డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సీఐలు వెంకటేష్, ఇజాజుద్దీన్ పాల్గొన్నారు.

నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు గిరిజ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్‌లో సోమవారం నుంచి ప్రారంభమైన సీనియర్ మహిళా జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి కె.గిరిజ ఎంపికయ్యారు. తెలంగాణ మహిళా జట్టులో ఆమె చోటు దక్కించుకున్నారు. క్రీడాకారిణి ఎంపికపై సంఘం సభ్యులు రజనికాంత్‌రెడ్డి, ఎండీ జియావుద్దీన్, ప్రదీప్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచాటి జిల్లాకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉత్తరాది మఠంలో పీఠాధిపతి పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ప్రమోదగిరిలోని ఉత్తరాది మఠంలో సోమవారం పీఠాధిపతులు శ్రీసత్యాత్మతీర్థ శ్రీపాదుల వారు శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, మూల రామచంద్రస్వామికి పూజలు, మహాభారత తాత్పర్య నిర్ణయ మంగళ మహోత్సవ పూజలు నిర్వహించారు. నెలరోజుల నుంచి మహాభారత ప్రవచనం చేసిన ఆనందాచార్యులను అభినందించారు.

స్వయం ఉపాధికి ఊతం


- మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ
- ఉమ్మడి జిల్లాకు 2,400 మిషన్లు కేటాయింపు
- త్వరలో అర్హులకు అందజేయనున్న ఎమ్మెల్యేలు

వివరాలు 8లో..

ఈద్ ముబారక్



స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా సోమవారం ఈద్-ఉల్-ఫితర్ పండుగను జిల్లాలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లావ్యాప్తంగా ముస్లింలు ఉదయం నుంచే ఆనందోత్సాహాలతో మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు ప్రత్యేక పండుగ ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ చదివి సర్వ మానవాళి క్షేమం కోరుతూ అల్లాహ్‌ను వేడుకున్నారు. హిందూ, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. జిల్లాలోని అన్ని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు జరిపారు. జిల్లాకేంద్రంలోని వానగట్టు వద్దనున్న రహెమానియా ఈద్గాలో వేలాదిమంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మసీదు ప్రధాన ఇమామ్ మౌలానా మహ్మద్ హాఫిజ్ ఇస్మాయిల్ ప్రత్యేక ప్రార్థనలు జరిపించి.. రంజాన్ విశిష్టత గురించి వివరించారు. రంజాన్ పండుగ నేపథ్యంలో ఈద్గా వద్ద ఎస్పీ జానకి బందోబస్తును పర్యవేక్షించారు.



జిల్లా కేంద్రంలోని రహెమానియా ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రముఖుల శుభాకాంక్షలు

రంజాన్ పవిత్ర మాసం అనంతరం ఈద్ ఉల్ ఫితర్‌ను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పారు. ఖౌమీ ఏక్తా కమిటీ తరపున ఈద్గా సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్‌ముదిరాజ్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, ఏపీ మిథున్‌రెడ్డి, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్ తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, ఇతర మైనార్టీ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు చెక్

నల్లమలలో పకడ్బందీగా ప్లాస్టిక్ నిషేధం అమలు

- వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ చర్యలు
- మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు
- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో 80 శాతం వరకు తగ్గిన వ్యర్థాలు
- ఇప్పటి వరకు 34 వేల కిలోల ప్లాస్టిక్ రీసైక్లింగ్ పూర్తి



సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టు పరిధిలో ఉన్న వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం అటవీశాఖ రెండేళ్లుగా ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమలు చేస్తోంది. నల్లమల గుండా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోలకు సాగిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా వాహనదారులు, ప్రయాణికులు వేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ కట్టడిపై చర్యలు కట్టుదిట్టం చేసింది. దట్టమైన నల్లమల అడవిలోకి రాకముందే ముఖద్వారం వద్ద వాహనదారుల నుంచి ప్లాస్టిక్‌ను సేకరించడంతోపాటు ఎట్టి పరిస్థితుల్లో అడవిలో ప్లాస్టిక్ వేయవద్దని విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. అటవీశాఖ చేపడుతున్న ప్లాస్టిక్ నిషేధంతోపాటు అవగాహన కార్యక్రమాలకు స్థానిక ప్రజలు, వాహనదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఫలితంగా ఇప్పటికే ఏటా అడవిలో పోగవుతున్న చెత్తలో సుమారు 80 శాతం వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించగలిగారు.

16 మంది స్వచ్ఛ సేవకులు

అడవిలోకి ప్రవేశించే వాహనాల్లో అత్యవసరంగా వినియోగించే వాటర్ బాటిళ్లను 2 లీటర్లు, అంతకన్నా పెద్ద సైజులో ఉండే సీసాలనే అనుమతిస్తున్నారు. ఖాళీ అయిన బాటిళ్లను అడవిలో ఎక్కడా పడవేయవద్దని వాహనదారులకు అవగాహన కల్పించిన తర్వాతే అడవిలోకి పంపుతున్నారు. ఫలితంగా చాలావరకు అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గాయి. ఎక్కడైనా రోడ్డుకు ఇరువైపులా ఉండే వ్యర్థాలను 16 మంది స్వచ్ఛ సేవకుల ద్వారా ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. చెక్‌పోస్టులు, అడవిలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను మన్ననూర్‌లోని ప్లాస్టిక్ బేయిలింగ్ కేంద్రంలో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఉన్న హైపర్ ప్లాస్టిక్ పార్క్ రీసైక్లింగ్ కేంద్రానికి తరలిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 34 వేల కిలోల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయడం గమనార్హం. ఇప్పటికే ప్లాస్టిక్ బాటిళ్లను రీసైక్లింగ్ చేస్తుండగా.. ఇకముందు చిప్స్, ఇతర కవర్లను సైతం రీసైక్లింగ్ చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అనూహ్య స్పందన..

ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, వ్యర్థాలను అడవిలో పడేయకుండా ఉండేందుకు స్థానికులు, వాహనదారులకు అటవీశాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ఈ మేరకు స్థానికులు, వ్యాపారులు, వాహనదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నల్లమలలోని మన్ననూర్, వటువర్లపల్లి, దోమలపెంట గ్రామాలతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, వ్యాపారులు సైతం ప్లాస్టిక్ నిషేధానికి సహకారం అందిస్తున్నారు.

అడవిలోకి రాకముందే..

హైదరాబాద్- శ్రీశైలం రహదారి మీదుగా శ్రీశైలం చేరుకునే ప్రయాణికులు సుమారు 60 కి.మీ., దట్టమైన నల్లమల అటవీప్రాంతం గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అడవి మధ్యలో విసిరేస్తున్న ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లతో ఏటా టన్నుల కొద్దీ వ్యర్థాలు పోగవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు వన్యప్రాణుల మనుగడకే ముప్పుగా మారుతున్నాయి. దీంతో ఎప్పటికప్పుడు రహదారి వెంట ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు అటవీశాఖ ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకుంది. పండుగలు, సెలవు రోజుల్లో వాహనాల రద్దీతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం పెరుగుతున్నాయి. అడవిలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుచేస్తూ.. అడవిలోకి రాకముందే చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్‌ను సేకరిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద, శ్రీశైలం నుంచి వచ్చే వాహనాలను దోమలపెంట చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేస్తున్నారు.

అందరి సహకారంతో..




నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ కోసం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమలుచేస్తున్నాం. అటవీశాఖ చేస్తున్న ప్రయత్నాలతో అడవిలో ఏటా పోగవుతున్న ప్లాస్టిక్ చెత్తలో 80 శాతం తగ్గింది. స్థానిక ప్రజలు, వ్యాపారులతోపాటు హైదరాబాద్- శ్రీశైలం రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారుల నుంచి సహకారం లభిస్తోంది.

– రోహిత్ గోపిడి, జిల్లా అటవీ శాఖ అధికారి



మన్ననూర్‌లోని ప్లాస్టిక్ బేయిలింగ్ కేంద్రం



అటవీశాఖ సిబ్బంది సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు (ఫైల్)

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే

- జిల్లావ్యాప్తంగా 43,562 దరఖాస్తులకు అనుమతి
- 7,335 మంది మాత్రమే ఫీజు చెల్లింపు
- ప్రభుత్వానికి సమకూరిన రూ.20.99 కోట్ల ఆదాయం
- అవగాహన కల్పించినా ముందుకు రాని ప్లాట్ల యజమానులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు జడ్చర్ల (బాదేపల్లి), భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. వాస్తవానికి 2020 ఆగస్టు 26 నాటికి ముందు డీటీసీపీ అనుమతులు లేకుండా వెంచర్లు వేసి విక్రయించిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవచ్చని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ చేపట్టింది. దీంతో అప్పట్లోనే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు రూ.వెయ్యి చొప్పున, అలాగే వెంచర్‌దారులు మిగిలిపోయిన ప్లాట్లకు సంబంధించి రూ.10 వేల చొప్పున ఆయా మున్సిపాలిటీలలో చెల్లించారు. వివిధ కారణాలతో అదే ఏడాది అక్టోబర్ 15 వరకే దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఆ తర్వాత 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీని కోసం మార్చి నెల 31లోగా చెల్లించేవారికి మొత్తం ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించినప్పటికీ దరఖాస్తుదారులు ఎక్కువగా ముందుకు రాకపోవడం గమనార్హం. కాగా, ఈ ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే చట్టబద్ధతతోపాటు అలాంటి వాటికే మార్కెట్‌లో విలువ పెరుగుతుందని, డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, బ్యాంకర్లు సైతం హౌసింగ్ లోన్స్ వెంటనే ఇస్తారన్నది వారు గుర్తించడం లేదు.

కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా..

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 31,278 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం అప్పట్లో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి గత నెలలో వారికి ఫోన్‌లో ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అధికారులు సమాచారం అందించారు. అర్హులైన 21,040 మంది ఫీజు చెల్లించాలని కోరగా గడువు ముగిసే సమయానికి కేవలం 3,886 మంది మాత్రమే కట్టారు. అయితే ఇందులో 924 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందగా, 2,962 మందికి త్వరలో చేరనుంది. వీటి ద్వారా ఇప్పటి వరకు రూ.13.37 కోట్ల ఆదాయం సమకూరింది.

- భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో 6,106 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులైన 4,819 మంది ఫీజు చెల్లించాలని కోరగా కేవలం 1,075 మంది మాత్రమే కట్టారు. అయితే ఇందులో 218 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందగా.. 857 మందికి త్వరలోనే చేరనున్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు రూ.1.79 కోట్ల ఆదాయం వచ్చింది.



మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్న దరఖాస్తుదారులు

- దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో 6,714 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులైన 6,535 మంది ఫీజు చెల్లించాలని కోరగా కేవలం 550 మంది మాత్రమే కట్టారు. అయితే ఇందులో ఒక్కరికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందగా, 549 మందికి త్వరలోనే చేరనున్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు రూ.1.13 కోట్ల ఆదాయం వచ్చింది.
- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 17,806 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులైన 11,168 మంది ఫీజు చెల్లించాలని కోరగా కేవలం 1,824 మంది మాత్రమే కట్టారు. అయితే ఇందులో 528 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందగా.. 1,296 మందికి త్వరలోనే చేరనున్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు రూ.4.7 కోట్ల ఆదాయం సమకూరింది.

పకడ్బందీగా రాజీవ్ యువవికాసం అమలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు గాను మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో నేరుగా దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సీఎస్ శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించేందుకు గాను మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఖాళీ దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అన్ని దరఖాస్తుల ప్రింట్ కాపీలు తీసి సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. రాజీవ్ యువ వికాసం కింద జిల్లాలోని యువత స్వయం ఉపాధి పొందేందుకు ఆయా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలుకు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు వివరించారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.10 వేల కోట్లు వెచ్చించి.. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఈ బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కలెక్టర్లు ఈ పథకంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అమలు చేయాలని, క్షేత్రస్థాయి వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి పథకం విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఈ పథకం కింద అర్హత పొందిన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. ఆన్‌లైన్ పోర్టల్ నుంచి కేవలం ఖాళీ దరఖాస్తులు మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ పథకం కింద ఏర్పాటు చేసిన యూనిట్లు శాశ్వతంగా ఉపాధి పొందేలా ఉండాలని, ప్రతి జిల్లాలో ఈ పథకాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు అధికారిని నియమించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి, ఆయా సంక్షేమ శాఖల అధికారులు శంకరాచారి, ఇందిర, సుదర్శన్, ఛత్రునాయక్, ఎల్‌డీఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు

ఊర్కొండపేటలో కలకలం

ఆలయానికి వచ్చిన మహిళపై సామూహిక అత్యాచారం

- ఒళ్లు జలదరించే రీతిలో చిత్రహింసలు
- జిల్లాలోని దర్శనీయ ప్రదేశాల్లో కొరవడిన భద్రత
- యథేచ్ఛగా మద్యపానం, గంజాయి వినియోగం
- ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోని వైనం



సాక్షి, నాగర్‌కర్నూల్: తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనం కోసం వచ్చిన ఓ మహిళ పట్ల మానవ మృగాలు దాడి చేసి పాశవికంగా ప్రవర్తించాయి. తలుచుకుంటేనే ఒళ్లు జలదరించే రీతిలో మహిళపై ఏడుగురు కిరాతకులు సామూహికంగా అత్యాచారానికి పాల్పడుతూ చిత్రహింసలు పెట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఊర్కొండ మండలంలో ప్రసిద్ధిగాంచిన ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఈ దారుణం చోటుచేసుకోవడం కలకలం సృష్టించింది.

ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన మహిళపై కామాంధులు దాడికి తెగబడ్డారు. శనివారం సాయంత్రం ఆలయానికి వచ్చిన ఆమె తల్లిదండ్రులు, పిల్లలు ఆలయ పరిసరాల్లో పడుకోగా, రాత్రి 10 గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లింది. అక్కడ కనిపించిన బంధువుతో మాట్లాడుతుండగా, అక్కడే కాచుకుని ఉన్న ఏడుగురు కామాంధులు వారిపై దాడిచేసి, ఆమె బంధువును చెట్టుకు కట్టేశారు. మహిళపై అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తూ ఏడుగురు కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మహిళ వెనకడుగు వేసినట్టు తెలిసింది. తర్వాత కుటుంబ సభ్యుల భరోసా మేరకు ఎట్టకేలకు సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దాడి చేసి.. చెట్టుకు కట్టేసి

గంజాయి, మద్యం మత్తులో..

జిల్లాలో పలుచోట్ల గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, బహిరంగంగా మద్యం తాగుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ మత్తులో విచక్షణ కోల్పోయి ఇష్టారీతిగా అఘాయిత్యాలు, నేరాలకు పాల్పడుతున్నారు. ఊర్కొండపేట ఆలయ పరిసరాలతోపాటు జిల్లాలో పలుచోట్ల ఇతర దర్శనీయ ప్రదేశాల్లో బహిరంగ మద్యపానం, గంజాయి వినియోగంపై తరచుగా ఫిర్యాదులు వస్తున్నా, పోలీసులు స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. పలుచోట్ల ఫిర్యాదు చేసినా, తరచుగా ఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నా ఆయా చోట్ల పోలీసుల నిఘా ఉండటం లేదు. తాజాగా మహిళపై సామూహిక అత్యాచార ఘటనలో గంజాయి, మద్యం మత్తులో నిత్యం జోగుతున్న స్థానిక యువకులు, పలువురు ఆటోడ్రైవర్ల పాత్ర ఉందని తెలుస్తోంది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారికి గతంలో ఏమైనా నేర చరిత్ర ఉందా.. ఇంకా ఎవరికైనా ఈ ఘటనతో సంబంధం ఉందా.. అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.

వేగంగా విచారణ చేస్తున్నాం..

బాధితురాలి నుంచి సోమవారం ఉదయం ఫిర్యాదు అందిన వెంటనే ఎస్‌ఐ, సీఐ అధికారులు స్పందించి కేసు నమోదు చేశారని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు. కేసుపై వేగంగా విచారణ కొనసాగుతోందన్నారు. ఏడుగురు నిందితులను గుర్తించి.. అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. బాధితురాలిపై నిందితులు అత్యంత దారుణంగా ప్రవర్తించారని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. కఠిన శిక్షపడేలా చూస్తామన్నారు.

నిందితులు ఎవరైనా వదిలిపెట్టం

జడ్చర్ల టౌన్: ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో నిందితులు ఎవరైనా వదిలేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని నాగర్‌కర్నూల్ ఎస్పీని కోరానని వెల్లడించారు. ఘటన పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారు ఓ పార్టీకి చెందిన నాయకులు అని తన దృష్టికి వచ్చిందని, అయితే ఈ ఘటనలో తాను రాజకీయాలు చేయదలుచుకోలేదన్నారు. బాధిత యువతికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని, యువతికి అండగా ఉంటామన్నారు.

క్లుప్తంగా

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

మరికల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన భర్త తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ రాము వివరాల మేరకు.. మరికల్ మండలం తీలేర్‌కు చెందిన హరిజన్ సుభాష్ (32)తో నారాయణపేట మండలం పెద్దజట్రంకు చెందిన లాల్‌కోట భాగ్యమ్మతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో ఇటీవల భాగ్యమ్మ తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తీలేర్‌కు రావాలని భర్త సుభాష్ ఆమెను పలుమార్లు వేడుకున్నా ఫలితం లేకపోవడంతో మనస్థాపానికి గురైన అతడు.. ఐదు రోజుల క్రితం గ్రామ శివారులోని చెరువులో దూకాడు. గమనిచ్చిన గ్రామస్తులు చెరువులో నుంచి బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. ఆదివారం అందరూ ఉగాది పండుగ జరుపుకొంటున్న సమయంలో అతడు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి కూతురు ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం

కల్వకుర్తి టౌన్: షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఆస్తినష్టం జరిగిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం .. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో అప్నా బజార్ అనే గానుగ నూనె, కిరాణం దుకాణంలో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో దుకాణంలోని గానుగనూనె యంత్రంతో పాటుగా, వస్తువులు అగ్నికి ఆహుతి కాగా, అదే దుకాణం పైన ఉన్న ఎంఎస్ సొల్యూషన్స్ కంప్యూటర్ దుకాణంలో ఉన్న వస్తువులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణంలో నూనె ఉండటంతో మంటలు అధికంగా వ్యాపించి ఉంటాయని స్థానికులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని బాధితులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడు కృష్ణమూర్తి

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కొండపేటకు చెందిన తెలుగు కృష్ణమూర్తి బైక్‌పై నక్కలపల్లికి వెళ్తున్న క్రమంలో పొగాకు కంపెనీ స్టేజీలో జాతీయ రహదారి దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నాలుగు ఇళ్లలో చోరీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్రలో సోమవారం తెల్లవారుజామున తాళం వేసిన నాలుగు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మొత్తం మూడు తులాల బంగారం, రూ.85 వేల నగదుతో పాటు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. వసంత ఇంటి తాళం పగలగొట్టి లోనికి వెళ్లి మూడు తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.70 వేలు చోరీ చేశారు. అలాగే వెంకటయ్య ఇంట్లో చొరబడి రూ. 10వేల నగదు అపహరించారు. యాదమ్మ ఇంట్లో రూ.5వేలు చోరీ చేశారు. మరో వ్యక్తి కుమ్మరి పర్వతాలు ఇంటి తాళం పగలగొట్టి లోనికి వెళ్లినా ఏమీ లభించలేదు. గ్రామానికి చెందిన బొట్టె శ్రీను ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై నిలిపి పొలంలో గేదెల పాలు పితుకుతుండగా.. దొంగలు గ్రామం నుంచి వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అయితే చోరీ ఘటన వివరాలను పోలీసులు విలేకరులకు అందించకుండా గోప్యంగా ఉంచారు.

హరిత లక్ష్యం అగ్గిపాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో రహదారి పక్కన లక్షల్లో ఖర్చు పెట్టిన ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కలు అగ్గిపాలవుతున్నాయి. మొక్కలు మంటల్లో తగులబడుతున్నా అదే రహదారిలోనే అధికారులు చూస్తూ వెళ్తున్నారే తప్పా మంటలు ఆర్పే ప్రయత్నం చేయలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని స్థానిక అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పరిశోధనకు పట్టం

జడ్చర్ల డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం విద్యార్థులకు అరుదైన గౌరవం


చెట్టు కాండం కొలతలు తీసుకుంటున్న పరిశోధన విద్యార్థులు

- మొక్కలు కార్బన్ డయాక్సైడ్ ఎంత గ్రహిస్తాయనే అంశంపై పరిశోధన
- బొటానికల్ గార్డెన్‌లో 1,228 చెట్లపై ఆరు నెలలపాటు రీసెర్చ్
- విద్యార్థుల జిజ్ఞాసకు దక్కిన తృతీయ స్థానం
- 9న హైదరాబాద్‌లో అవార్డు స్వీకరణ

జడ్చర్ల టౌన్: మొక్కలు కార్బన్ డయాక్సైడ్ ఎంత గ్రహిస్తాయనే అంశంపై జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల పరిశోధనలకు అరుదైన గౌరవం లభించింది. రాష్ట్రస్థాయిలో కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ (సీసీఈ) నిర్వహించే జిజ్ఞాసలో వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులకు తృతీయ స్థానం దక్కింది. రాష్ట్రంలోని 134 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 13 విభాగాల్లో 16 అంశాలపై పోటీలు నిర్వహించగా.. జిజ్ఞాసకు జడ్చర్ల కళాశాల నుంచి వివిధ విభాగాల నుంచి 5 అంశాలు పంపించారు. సీసీఈ జిజ్ఞాస ఫలితాలు గతనెల మూడవ వారంలో విడుదల చేయగా.. జడ్చర్ల డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఏప్రిల్ 9న హైదరాబాద్ రూసా కార్యాలయంలో జరిగే వేడుకల్లో ప్రదానంచేసే అవార్డును డా.సదాశివయ్య బృందం స్వీకరించనుంది.

జిజ్ఞాస లక్ష్యం..

డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులను చదువుతో పాటు పరిశోధనల వైపు మళ్లించడం.. వారిచే నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేందుకు గాను కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ 2016–17లో జిజ్ఞాసను ప్రారంభించింది. ఒక్కో విభాగంలో పరిశోధన చేసే అంశం కోసం ఐదుగురు విద్యార్థులు, ఒక మెంటర్ (అధ్యాపకుడు) ఉంటారు. రాష్ట్రంలోని 134 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రూపొందించిన అంశాలను నేరుగా సీసీఈకి పంపిస్తున్నారు. అలా పంపించిన అంశాలను రూసా కార్యాలయంలో ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నారు.

ఆరు నెలలపాటు పరిశోధనలు..

చెట్లు కార్బన్ డైయాక్సైడ్ గ్రహిస్తాయని అందరికీ తెలిసిందే. అయితే అవి ఎంత గ్రహిస్తాయని మాత్రం తెలియదు. ఈ విషయం తెలుసుకుందామని వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా. సదాశివయ్య ఆధ్వర్యంలో ఆ విభాగం విద్యార్థులు రవీందర్, ఇందు, మేఘన, శివసాయి, సహిస్త ఆజ్మి ఆరు నెలల పాటు పరిశోధనలు చేశారు. కళాశాల బొటానికల్ గార్డెన్‌లో ఉన్న 105 జాతులకు చెందిన 1,228 చెట్లపై వారు పరిశోధనలు జరిపారు. చెట్టు ఎత్తు, కాండం కొలతలతో వాటి సాంద్రత విలువలు కనుక్కుని, ఒక్కొక్క చెట్టు ఎంత కార్బన్ డయాక్సైడ్ తీసుకుంటుందో లెక్కగట్టారు. గార్డెన్‌లో 6వేలకు పైగా మొక్కలు, చెట్లు ఉండగా.. 1,228 చెట్లు ఒక్కొక్కటి 30 సెం.మీ. కన్నా ఎక్కువ చుట్టు కొలత ఉన్నవి గుర్తించారు. ఈ చెట్లు ఏడాదికి 282 టన్నుల కార్బన్ డయాక్సైడ్ తీసుకుంటాయని ప్రాజెక్ట్ ద్వారా వెల్లడైంది. ఇదే అంశాన్ని వీడియో, ఆడియో రూపంలో పంపగా తృతీయస్థానం దక్కింది.

రాష్ట్రంలోనే ప్రథమం..

డిగ్రీ కళాశాల స్థాయి విద్యార్థులు చేసిన పరిశోధన రాష్ట్రంలోనే ప్రథమం కావడం విశేషం. రాష్ట్రంలో ఉస్మానియా, కాకతీయ, మహాత్మా గాంధీ, శాతవాహన, తెలంగాణ, పాలమూరు, హైదరాబాద్ మొత్తం 7 యూనివర్సిటీలు ఉండగా.. ఏ ఒక్క యూనివర్సిటీలోనూ డిగ్రీ స్థాయిలో ఇలాంటి పరిశోధనలు జరగలేదంటే అతిశయోక్తి లేదు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ, ఎన్వరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్‌ఐ)లలో మాత్రమే చెట్లు కార్బన్ డయాక్సైడ్ తీసుకునే దానిపై పరిశోధనలు జరిగాయి. అయితే రెండు చోట్ల డా.సదాశివయ్య శిష్యులే పరిశోధనలు చేయడం గమనార్హం.

పరిశోధన ప్రయోజనాలు..

సాధారణంగా ఏగిస, నారేపి, రావి, మర్రి, మామిడి వంటి చెట్లు కార్బన్ డయాక్సైడ్ ఎక్కువగా తీసుకుంటాయని తేలడంతో.. వాటిని కాలుష్య ప్రాంతాల్లో ఎక్కువగా పెంచేలా ప్రభుత్వం సిఫార్సులు చేయవచ్చు. దీనివల్ల వాతావరణ కాలుష్యం తగ్గే అవకాశాలు పెరుగుతాయి. కళాశాలలోని 1,228 చెట్లు 282 టన్నుల కార్బన్ డయాక్సైడ్ స్వీకరిస్తున్నందున.. వాటికి కాలుష్య పరిశ్రమలు ఏడాదికి రూ. 5లక్షలు చెల్లించాల్సి వస్తుందని తేలింది. భవిష్యత్‌లో జడ్చర్ల కళాశాల బొటానికల్ గార్డెన్‌కు ఈ రూపంలో భారీగా ఆదాయం సమకూరనుంది.

ఆనందంగా ఉంది..



ఏ చెట్టు ఎంత కార్బన్ డయాక్సైడ్ తీసుకుంటాయో పరిశోధన చేద్దామని మెంటర్ డా.సదాశివయ్య చెప్పగానే చెప్పలేని అనుభూతి కలిగింది. ఆరు నెలలపాటు చేసిన పరిశోధనలతో మాకు అనేక కొత్త విషయాలు తెలిశాయి. ఇకపై నారేపి, ఏగిస, రావి, మర్రి, మామిడిలాంటి చెట్లు నాటితే బాగుంటుంది. జిజ్ఞాసలో మాకు అవార్డు రావడం ఆనందంగా ఉంది.

– మేఘన, పరిశోధన విద్యార్థి

ఆడుతూ పాడుతూ..



ఆరు నెలలపాటు ఆడుతూ పాడుతూ చెట్లపై పరిశోధనలు చేశాం. ఒక్కో చెట్టు ఎత్తు, విస్తీర్ణం తీసుకుని అవి కార్బన్ డయాక్సైడ్ ఎంత గ్రహిస్తున్నాయో తెలుసుకోగలిగాం. ఇలాంటి అరుదైన అవకాశం దక్కడం ఆనందంగా ఉంది. జడ్చర్ల కళాశాలలో బొటానికల్ గార్డెన్ ఉండటం వల్ల డిగ్రీ స్థాయిలోనే మేము పరిశోధన చేసే అవకాశం దక్కింది. మా పరిశోధన విషయాలను స్టేజీపై వెల్లడించడం మరపురాని అనుభూతి.

– రవీందర్, పరిశోధన విద్యార్థి

మానవాళికి మేలు..



బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థులు చేసిన పరిశోధనలు మానవాళికి ఎంతో ఉపయోగం కానున్నాయి. ఏ చెట్టు ఎంత కార్బన్ డయాక్సైడ్ గ్రహిస్తుందో తెలియడం వల్ల.. అలాంటి చెట్లను ఎక్కువగా నాటడానికి అవకాశం దక్కుతుంది. ఇలాంటి పరిశోధన రాష్ట్రంలోనే ఇదే ప్రథమం. మా పరిశోధనలకు జిజ్ఞాసలో తగిన గౌరవం దక్కింది. బొటానికల్ గార్డెన్‌లోని 1,228 చెట్లు 282 టన్నుల కార్బన్ డయాక్సైడ్ గ్రహిస్తున్నాయి. మొత్తం మొక్కలను లెక్కిస్తే రెట్టింపు కార్బన్ డయాక్సైడ్ గ్రహిస్తాయని గుర్తించవచ్చు. దీన్ని ద్వారా భవిష్యత్‌లో భారీగా ఆదాయం సమకూరనుంది.

– డా.సదాశివయ్య, పరిశోధనల మెంటర్, గార్డెన్ సమన్వయకర్త

కళాశాలకు గర్వకారణం..



జిజ్ఞాసలో వృక్షశాస్త్ర విద్యార్థులు చేసిన పరిశోధనలకు గుర్తింపు దక్కడం కళాశాలకు గర్వకారణం. బొటానికల్ గార్డెన్ వల్ల అంతర్జాతీయ స్థాయిలో కళాశాలకు గుర్తింపు దక్కింది. డిగ్రీ స్థాయిలో ఎక్కడ జరగని పరిశోధనలు మా వద్ద జరగడం ఆనందంగా ఉంది. మరిన్ని పరిశోధనలకు అవార్డు స్ఫూర్తి కానుంది. వృక్షశాస్త్ర మెంటర్‌తో పాటు విద్యార్థులకు అభినందనలు.

– డా.సుకన్య, ప్రిన్సిపాల్, బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, జడ్చర్ల

వేములలో బాలుడి కిడ్నాప్

- వాడ్యాల్ స్టేజీ వద్ద పట్టుకున్న హోటల్ యజమాని

మిడ్జిల్: మండలంలోని వేముల గ్రామంలో మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి ఇతర ప్రాంతానికి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సంఘటన సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మిడ్జిల్ మండలం వేములలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని వేముల గ్రామానికి చెందిన బండారి రాజేందర్‌గౌడ్, సంధ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు రుద్రాంశ (3) సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆరుబయట ఆడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన లక్మాల రామస్వామి బాలుడిని కిడ్నాప్ చేసి, వాడ్యాల్ స్టేజీ దగ్గరకు బస్సు ఎక్కేందుకు వచ్చాడు. అక్కడ టీ కొట్టు నిర్వహిస్తున్న లక్కీ అనే మహిళకు అనుమానం వచ్చి ప్రశ్నించగా, తన మనుమడు అని చెప్పాడు. గట్టిగా నిలదీయడంతో బాలుడి తండ్రికి ఫోన్ చేసి మీ కుమారుడు నా దగ్గర ఉన్నాడు అని చెప్పాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి వచ్చి అతన్ని నిలదీయడంతో పొంతనలేని సమాధానం చెప్పాడు. రాత్రి 9గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.


కిడ్నాప్‌కు గురైన రుద్రాంశ

కరివేపాకు సాగు.. లాభాలు బాగు

అలంపూర్: కరివేపాగు సాగు ఎంతో సులభమని.. జిల్లా వాతావరణం అనుకూలంగా ఉంటుందని డీఏఓ సక్రియనాయక్ తెలిపారు. ఎర్ర నేలలో పంట సాగుచేస్తే అధిక దిగుబడి వస్తోందని.. లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు.

పంట రకాలు..

సెంకంపు: ఈ రకం తమిళనాడులో అధికంగా పండిస్తారు. ఆకు ఎక్కువగా ఉండి నూనే శాతం, వాసన కలిగి ఉంటాయి.

డీడబ్ల్యూడీ–1: ఈ రకం ఆకు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటుంది. చలిని తట్టుకోలేదు.. ఆకులను పొడిగా చేసుకొని వాడుకోవచ్చు.

డీడబ్ల్యూడీ–2: విత్తనాల ద్వారా వేసిన పంట నుంచి ఎన్నుకోబడిన రకం. ఆకు లేతపసుపు రంగులో ఉండి వాసన తక్కువగా ఉంటుంది. చలిని తట్టుకుంటుంది. పెరుగుదల అధికంగా ఉంటుంది.

సువాసిని: వేరు మొక్కల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. మెట్ట ప్రాంతాలకు అనుకూలం.

భువనేశ్వర: నీటివసతి ప్రాంతాల్లో ఎక్కువగా సాగవుతుంది. అన్ని రకాల నేలల్లో పండిస్తారు. మురుగునీరు పారుదల సౌకర్యం ఉన్న ఎర్ర నేలలు శ్రేష్ఠం. ఎర్ర తువ్వ నేలల్లో పెరుగుదల బాగా ఉంటుంది. ఆకు దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

విత్తుట: విత్తనాలతో నారు మొక్కలను పెంచి ప్రధాన పొలాల్లో నాటాలి. నారు పెంచేందుకు బాగా పెరుగుదల కలిగిన తల్లి చెట్ల నుంచి బాగా పండించిన మంచి పండ్లు కోయాలి. జులై, ఆగస్టు నెలల్లో పండ్లు కాస్తాయి. ఆగస్టులో పండ్లు సేకరించుకొని కోసిన 3, 4 రోజుల్లో విత్తనాలు తీసి నారు మళ్లు, పాలిథిన్ సంచుల్లో విత్తాలి. ప్రతి పండులో 3, 4 విత్తనాలు ఉంటాయి.


కరివేపాకు పంట

పాడి–పంట

అధికారి సలహా: సక్రియనాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

విత్తన మోతాదు: ఎకరాకు 80 నుంచి 100 కిలోల విత్తనాలు లేదా 25 కిలోల పండ్లు సరిపోతాయి.

విత్తే పద్ధతి: మీటర్ విస్తీర్ణంలో 30 సెం.మీ. ఎత్తు కలిగిన నారుమళ్లను తయారు చేయాలి. నారుమడికి తగినంత పశువుల ఎరువు వేసి తర్వాత 10 సెం.మీ. దూరంలో విత్తనాలు విత్తుకోవాలి. మూడురోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి.

నేల తయారీ, మొక్కలు నాటుట..

ప్రధాన భూమిని 3 నుంచి 4 సార్లు బాగా దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువు వేయాలి. 30.30.30 సెం.మీ. పరిమాణం గల గుంతల్లో 1.2 నుంచి 1.5 మీ దూరంలో మొక్కలు నాటాలి. మొక్కలు నాటడానికి రెండు నెలల ముందు గుంతలు తీయాలి. ఈ గుంతలను పశువుల ఎరువు కలిపి నింపాలి. గుంత మధ్యలో ఒక్కో నారు మొక్క నాటాలి.

ఎరువులు: ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 28 కిలోల నత్రజని, 9 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ ఉన్న ఎరువును కలిపి గుంతలో సమానంగా నింపాలి. మొక్కలను నాటిన వెంటనే గుంతలను తడపాలి. మూడోరోజు మరో తడి అందించాలి. గుంతలను కలుపుతూ కాల్వలు ఏర్పాటు చేసి నీటిని అందించాల్సి ఉంటుంది.

అంతర కృషి: గుంతల మధ్య ఎలాంటి కలుపు లేకుండా చూడాలి. మొదటి సంవత్సరం గుంతల మధ్య అపరాలు పండించవచ్చు.

సస్యరక్షణ చర్యలు: గొంగళి పురుగు చిన్నప్పుడు తెల్లని చారలతో నలుపు రంగులో ఉంటుంది. తరువాత ముదురు ఆకుపచ్చ రంగులో లావుగా స్థూపాకారంలోకి మారుతుంది. పురుగులను చేతితో తీసి నాశనం చేయడం శ్రేయస్కరం, వేప సంబంధిత క్రిమిసంహార మందులు ఉపయోగించాలి. తప్పని పరిస్థితుల్లో నువాన్ 1 మి.లీ. లేదా 2 మి.లీ. క్వినాల్‌ఫాస్ లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలి.

⇨ ఆకుపచ్చ తెగులు సోకే అవకాశం ఉంది. దీని నివారణకు గ్రాము కార్బండిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గంధం కలిగిన క్రిమి నాశికాలను వాడితే ఆకు రాలిపోతుంది. కాబట్టి మందును వాడరాదు.

దిగుబడి: మొదటి సంవత్సరం ఎకరాకు 100 నుంచి 160 కిలోల దిగుబడి వస్తోంది. రెండు నుంచి మూడు సంవత్సరాల్లో ప్రతి నాలుగు నెలలకు ఒక్కో కోతలో ఎకరాకు 700 కిలోల చొప్పున సంవత్సరానికి 2,100 కిలోల ఆకు వస్తుంది. 4వ సంవత్సరంలో ప్రతి మూడు నెలలకు ఒక కోతలో వెయ్యి కిలోల చొప్పున 4 వేల కిలోల దిగుబడి వస్తుంది. 5 సంవత్సరం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎకరాకు 2 వేల కిలోల ఆకు చొప్పున ఏడాదికి 8 వేల కిలో ఆకు దిగుబడి వస్తుంది.

స్వయం ఉపాధికి ఊతం


వనపర్తిలో కుట్టుమిషన్ల పంపిణీని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

- మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ
- ఉమ్మడి జిల్లాకు 2,400 మిషన్లు కేటాయింపు
- త్వరలో అర్హులకు అందజేయనున్న ఎమ్మెల్యేలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమం కింద నిరుపేద మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వనున్నారు. మూడు నెలల క్రితం ఆన్‌లైన్ ద్వారా కుట్టుమిషన్ల పథకానికి దరఖాస్తులు స్వీకరించగా.. ఇప్పుడు వీటిని పంపిణీ చేయనున్నారు.

15 వేలకుపైగా దరఖాస్తులు

రాష్ట్రంలోని 9 జిల్లాల్లో ఫేజ్–1 కింద 10,490 కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. కాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 2,400 కుట్టుమిషన్లను మైనార్టీ మహిళలకు పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి దాదాపు 15 వేలకు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల 2న వనపర్తి జిల్లాకేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. త్వరలోనే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కుట్టుమిషన్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. కాగా.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలో 2 వేల మిషన్లను లబ్ధిదారులకు ప్రత్యేకంగా పంపిణీ చేయనున్నారు.

నిరుద్యోగులకు రాజీవ్ యువవికాసం

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం గత నెల 11న ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద రాష్ట్రంలోని 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీ రుణాలు అందించనున్నారు. దీనికోసం ఈ నెల 5 వరకు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ జరగనుంది. 6 నుంచి 31 వరకు లబ్ధిదారుల ఎంపిక, జూన్ 2న ఎంపికైన వారికి మంజూరు పత్రాలు అందజేయనున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు మైనార్టీ నిరుద్యోగ యువతకు దాదాపు 3 వేలకుపైగా యూనిట్లు మంజూరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మైనార్టీల సంక్షేమానికి కృషి

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుంది. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు నిర్వహిస్తున్నాం. ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీల్లోని నిరుపేద వర్గాలకు స్వయం ఉపాధి కోసం బ్యాంకు లింకేజీ ద్వారా 80 శాతం, 60 శాతం, 70 శాతం సబ్సిడీతో రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందిస్తాం. రాజీవ్ యువ వికాసం కోసం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.850 కోట్లు కేటాయించింది.

– ఒబేదుల్లా కొత్వాల్, టీజీఎంఎఫ్‌సీ చైర్మన్

జిల్లాల వారీగా కుట్టుమిషన్ల కేటాయింపు ఇలా..

జిల్లా	కుట్టుమిషన్లు
మహబూబ్‌నగర్	700
నాగర్‌కర్నూల్	700
నారాయణపేట	350
వనపర్తి	350
జోగులాంబ గద్వాల	300

పండుగలు సైతం లెక్కచేయక..


సొరంగం నుంచి బయటకు తెచ్చిన టీబీఎం శకలాలు పరిశీలిస్తున్న అధికారులు

- ఎస్‌ఎల్‌బీసీలో నిర్విరామంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- మట్టి, బురద, రాళ్ల తొలగింపు వేగవంతం
- నీటిఊట ఎప్పటికప్పుడు తోడివేత

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఆరుగురి ఆచూకీ కోసం సహాయక బృందాలు పండుగలు సైతం లెక్కచేయక గాలింపు చేపడుతున్నాయి. సొరంగంలోని మట్టి, బురద, బండరాళ్లను కన్వేయర్ బెల్టు ద్వారా, టీబీఎం శకలాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. సొరంగం పైకప్పు కూలిన సమీప ప్రదేశం నుంచి లోకో ట్రైన్ ఇంజన్, క్యాబిన్‌ను బయటకు తరలించడంతో రాకపోకలకు మార్గం సుగమమైంది. సహాయక చర్యల్లో అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సామగ్రిని వినియోగిస్తున్నారు.

కొనసాగుతున్న కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ..

సహాయక చర్యలు మరింత వేగవంతం చేసేందుకు కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 13.630 కి.మీ. నుంచి 13.73 కి.మీ. వరకు వంద మీటర్లు పునరుద్ధరించారు. దీంతో ఎస్కవేటర్ల సాయంతో సొరంగం లోపలి మట్టిని బయటకు తరలించడానికి అవకాశం లభించింది.

సహాయక చర్యలు వేగవంతం..


సహాయక బృందాల ఉన్నతాధికారులుతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్

సొరంగంలో సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. సోమవారం జేపీ కంపెనీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్‌రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేటిచంద్రం, జేపీ కంపెనీ ప్రతినిధులతో సహాయక చర్యలపై సమీక్షించారు. సహాయక బృందాలు ప్రతికూల పరిస్థితుల్లో కూడా 24 గంటలు శ్రమిస్తున్నారని చెప్పారు. సహాయక బృందాలు, నిపుణులు సమన్వయంతో పనిచేస్తున్నారని.. మైనింగ్ ప్రమాదాల్లో నిష్టాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. నీటి ఊటను అత్యధిక సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నామని వివరించారు. సహాయక సిబ్బందికి ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఇరువర్గాల ఘర్షణ.. చెదరగొట్టిన పోలీసులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద సోమవారం ఇరువర్గాలు ఘర్షణ పడగా.. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని చెదరగొట్టారు. అయితే ఆయా వర్గాలు పట్టణంలోకి వచ్చాక మళ్లీ గొడవకు దిగే అవకాశం ఉండటంతో ఒక వర్గానికి చెందిన కొందరిని అదుపులోకి తీసుకున్నారు. మరో వర్గం వారు పోలీసుస్టేషన్ వద్దకు వచ్చి గొడవకు దిగడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి తరిమివేశారు. పట్టణంలోని వక్ఫ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన లెక్కల విషయంలో కొంతకాలంగా రెండువర్గాల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పూర్తిగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్